
నిజామాబాద్
సోమవారం 11 డిసెంబర్ 2023



# అతివకు అభయం..

# నిర్భయ చట్టం




- రూ.వెయ్యి కోట్లతో నిర్భయ నిధి ఏర్పాటు
- పోక్సో చట్టం కింద కేసు నమోదైతే 20 ఏండ్ల జైలు
- నిర్భయ చట్టంపై అవగాహన కార్యక్రమాలు

సదాశివనగర్, డిసెంబర్ 10: 2013లో దేశ రాజధానిలో ఓ యువతిపై సామూహిక లైంగిక దాడి జరిగింది. ఆ యువతి చికిత్స పొందుతూ దవాఖానలో మృతిచెందింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మహిళలను గౌరవిస్తున్న దేశాల్లో ప్రధానమైనది మన భారతదేశం. అలాంటి భారతదేశంలో ఓ యువతిపై సభ్య సమాజం సిగ్గుపడేలా లైంగికదాడి జరపడం.. ఆ యువతి మృతి చెందడంపై దేశవ్యాప్తంగా మహిళల భద్రతపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆ సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందే ఈ నిర్భయచట్టం–2013. 2013 మార్చి 19న లోక్‌సభలో, మార్చి 21న రాజ్యసభలో ఈ చట్టం ఆమోదం పొందింది. అప్పటి నుంచి మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించినా, అవమానించినా, వారి మనోభావం దెబ్బతినేలా ప్రవర్తించినా నిర్భయ–2013 చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలనేదే ప్రధాన ఉద్దేశం.


ఎలారెడ్డి ప్రభుత్వ బాలికల పాఠశాలలో బాల్య వివాహాలు, పోక్స్ చట్టం పై విద్యార్థులకు అవగాహన

- నిర్భయ– 2013 చట్టంలో ప్రధానంగా ఐపీసీ 354 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేయబడుతుంది.
- నిర్భయచట్టం ఆమోదానికి ముందు ఐపీసీ 354 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు పూర్తయిన తర్వాత విచారణ అనంతరం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టుకు పంపించేవారు.
- ఢిల్లీ ఘటన తర్వాత ఐపీసీ 354 సెక్షన్‌లో చేర్పులు చేశారు. మహిళలను వేధించడంతోపాటు వారిపై ప్రవర్తించే ప్రతి అంశానికో సెక్షన్ కింద కేసు నమోదు చేసేందుకు వీలుగా మార్పులు చేశారు.
- మహిళలపై దౌర్జన్యం చేయడం, వారిని అవమానించడం, వారిపై బలప్రయోగం చేస్తే ఐపీసీ 354 సెక్షన్ కింద నేరం.

## పోక్సో చట్టంలో కేసు నమోదైతే 20ఏండ్ల శిక్ష..

మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, వారిని వేధించినా చట్ట ప్రకారం నేరం. అలాంటి వారిపై చర్యలు తప్పవు. మహిళలపై బాధ్యతగా వ్యవహరించి వారిని గౌరవించాల్సిన సంస్కృతిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి. పోక్సో చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ సెక్స్‌వల్ అఫెన్సెస్) ఏకైక చట్టం ఉన్నది. 18ఏండ్లు నిండని ఆడ, మగవారు ఫిర్యాదు చేయవచ్చు. అమ్మాయికి ఇష్టం ఉన్నా.. మైనర్ కావడంతో చట్టంలో చెల్లదు. ఈ నేరాల్లో చుట్టాలే నేరస్తులుగా ఉండే అవకాశం ఉంటుంది. 18ఏండ్ల పిల్లలపై జరిగే నేరాలకు 20ఏండ్ల శిక్షణ ఉంటుంది. కేసు నమోదైన 24గంటల లోపల న్యాయమూర్తి వద్ద ప్రవేశపెట్టి, 164 స్టేట్‌మెంట్ రికార్డు చేస్తాం. కోర్టు కేసులు నడిచే సమయంలో రికార్డు అయిన తర్వాత తప్పకుండా శిక్ష పడుతుంది. 60రోజుల్లోనే చార్జ్‌షీట్ ఫైల్ చేసి కోర్టుకు అందిస్తాం. దీంతో నిందితులకు శిక్షపడే అవకాశం ఉంటుంది.



**– శ్రీనివాసులు, డీఎస్పీ, ఎల్లారెడ్డి**

### ఐపీసీ 354/ఎ :

- మహిళలను లైంగికంగా వేధించడంతోపాటు భౌతికంగా వేధిస్తూ శరీరానికి తాకడం.
- పురుషులు మహిళలను లైంగికంగా వేధిస్తూ తన కోరికలు తీర్చాలని వెంటపడడం.
- మహిళల ఇష్టానికి వ్యతిరేకంగా నీలిచిత్రాలు చూపించడం, ఇబ్బందికరంగా ఉన్న నీలిచిత్రాలకు సంబంధించిన ఫొటోలు చూపించి ఇబ్బంది పెట్టడం.
- మహిళలనుద్దేశించి లైంగిక పరమైన వ్యాఖ్యలు చేసి ఇబ్బందిపెట్టడం కూడా నిర్భయ చట్టం కిందకే వర్తిస్తాయి.

### ఐపీసీ 354/బీ:

- ఒంటిపై బట్టలులాగి వేధించడం, బలప్రయోగంగా వివస్త్రను చేసి అవమానించడం.

### ఐపీసీ354/సీ

- మహిళల రహస్య, వ్యక్తిగత చర్యలను చూడడం, అలాంటి వాటిని ఫొటోలు తీయడం కూడా నిర్భయ/2013 చట్టం కింద నేరమే.
- బహిర్భూమికి వెళ్లిన వారిని చూడడంతోపాటు మహిళలతో కలిసి దిగిన ఫొటోలు ఇతరులకు చూపి ఫొటోల్లో ఉన్న మహిళలను కించపరిచేలా ఇబ్బంది పెట్టడం కూడా నిర్భయచట్టం ప్రకారం నేరమే.

### ఐపీసీ354/డీ

- మహిళలను వేధించడంతోపాటు వారిని వెంబడించడం, వారితో చనువుగా ఉండేందుకు ప్రయత్నించినా నేరమే.
- సోషల్‌మీడియా, సెల్ ఫోన్‌లతో ఇబ్బందిపెడుతూ అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టి లోబర్చుకునేందుకు ప్రయత్నించినా నిర్భయచట్టం ప్రకారం నేరస్తులే.
- ఈ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు కావడంతోపాటు కోర్టుల్లో నేరాలు రుజువైతే మొదటిసారి నిందితులకు మూడేండ్లు శిక్షపడే అవకాశం ఉంటుంది. అదే వ్యక్తి రెండోసారి ఇదే సెక్షన్ల కింద నిందితుడిగా ఉండి కోర్టులో రుజువైతే ఐదేండ్లు జైలు శిక్ష పడుతుంది. మూడోసారి ఇదే కేసులో నిందితుడుగా రుజువైతే మళ్లీ మరో ఐదేండ్లు జైలు శిక్ష పడుతుంది.


మానవ అక్రమ రవాణా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పోలీసు అధికారులు(ఫైల్)

## మహిళలను గౌరవించాలి



దేశంలో మహిళలు, పిల్లలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి. చిన్న పిల్లలపై లైంగిక దాడికి పాల్పడితే కఠిన శిక్ష ఉంటుంది. పోక్సో చట్టం వచ్చిన తర్వాత 18ఏండ్లు నిండని పిల్లలపై నేరాలు తగ్గాయి. సోషల్ మీడియా విషయంలో ఆడపిల్లలు, గృహిణులు అప్రమత్తంగా ఉండాలి. పరిచయం లేని వారితో సంభాషణలు చేయొద్దు. చిన్నపిల్లల పట్ల ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలి.

**– రాజు, ఎస్సై , సదాశివనగర్**

## విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, మహిళా సంఘాలు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లతోపాటు గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో పిల్లలు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నది. జిల్లాలో 500వరకు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశాం. ఇంటి పక్కవారు, బంధువుల వరుస అయిన వారు ప్రేమగా నటిస్తూ పిల్లలను దగ్గరికి తీసుకొని ఫొటోలు, వీడియోలు తీస్తూ వారి తల్లిదండ్రులకు తెలియకుండా బ్లాక్ మెయిల్ చేస్తూ చిత్రహింసలు పెట్టడం వంటివి చేస్తారు. ఎవరికైనా సరే పిల్లలను నమ్మవద్దు.

**– అమృతారాజేందర్, ఐఎస్ఆర్డీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు**

## బాల్యవివాహాలు రూపుమాపాలి



పిల్లలకు తెలిసీతెలియని వయస్సులో పెండ్లి చేసి తల్లిదండ్రులు చేతులు దులుపుకొంటున్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరూ పిల్లల వయస్సు వచ్చిన తర్వాతే పెండ్లి చేస్తున్నారు. బాల్య వివాహం చేస్తే కఠినంగా శిక్షించేలా చట్టం ఉన్నది. బాల్య వివాహాలు చేసినట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి. బాల్య వివాహం చేసిన వారిపై పోలీసులు, ఐసీడీఎస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి తల్లిదండ్రులు, బంధువులపై కేసు నమోదు చేస్తారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా బాల్య వివాహాలను అడ్డుకోవాలి.

**– సోలంకి రవళి, సామాజిక కార్యకర్త, లింగంపల్లి**



# ఆధ్యాత్మిక సేవలో.. ఆత్మారాం మహరాజ్

**నేటి సమాజంలో** డబ్బుల సంపాదనే ధ్యేయంగా ఎవరికి వారే తమ వృత్తులను కొనసాగిస్తున్నారు. డబ్బుకు ఇచ్చే ప్రాధాన్యత మానవ విలువలకు, దైవిక సంబంధాలకు తక్కువయ్యాయనే చెప్పవచ్చు. కానీ, ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీరామ మఠం వంశజులు, చిలుకూరు శివాలయం ప్రధాన అర్చకుడు శ్రీరామదాసి సురేశ్ ఆత్మారాం చేస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి.


– శక్కర్‌నగర్, డిసెంబర్ 10

- పురాతన ఆలయాల జీర్ణోద్ధరణ
- హైందవ సంప్రదాయ పరిరక్షణకు కృషి
- దాతల సహకారంతో అర్చకునిగా విశిష్ట కార్యక్రమాలు
- ఆదర్శంగా నిలుస్తున్న శ్రీ రామదాసి సురేశ్ ఆత్మారాం మహరాజ్

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీ రామ మఠం వందల ఏండ్ల క్రితం సమర్థరామదాసు స్వామీజీ చేతుల మీదుగా ఏర్పాటు చేశారని ప్రాశస్త్యంలో ఉన్నది. కాగా, ఈ మఠాన్ని పట్టించుకునే వారు లేక, పలువర్గాల కలహాలతో 20 ఏండ్ల క్రితం రామదాసి కుటుంబీకులు గ్రామానికి దూరంగా వెళ్లారు. వారిలో ఒకరైన శ్రీ సురేశ్ ఆత్మారాం మహరాజ్ మఠం జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టారు. గ్రామస్తుల సహకారం కోరుతూ తాను ఉంటున్న చిలుకూరు, హైదరాబాద్‌లోని భక్తబృందం, దాతల సహకారంతో జీర్ణోద్ధరణ చేశారు. నాటి నుంచి ఎడపల్లి మండల కేంద్రంలో శ్రీరామ నవమి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య కొనసాగుతున్నాయి.

### పలు ఆలయాల జీర్ణోద్ధరణ..

ఎడపల్లి గ్రామానికి దూరంగా వెళ్లిన రామదాసి రాజారాం మహరాజ్ కుమారుల్లో ఒకరైన శ్రీరామదాసి సురేశ్ ఆత్మారాం మహరాజ్ మొదటగా ఎడపల్లి శ్రీరామ మఠం జీర్ణోద్ధరణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ఆయన శ్రీరామ మఠాన్ని నూతనంగా నిర్మించి కార్యక్రమాలు పునఃప్రారంభించారు. ఈ దేవాలయమే కాకుండా పలు శిథిలావస్థకు చేరిన దేవాలయాలను పునర్నిర్మించారు. బోధన్– నిజామాబాద్ రహదారి పక్కన అంబం, నర్సాపూర్ గ్రామాల మధ్య ఓ చెట్టు కింద శిథిలావస్థలో ఉన్న హనుమాన్ మందిరాన్ని చూసిన ఆయన.. ఆలయ నిర్మాణానికి నడుంబిగించారు. 13ఏండ్ల క్రితం ఈ ప్రాంతంలో సుమారు రూ.25లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. రామమందిరం, నర్సాపూర్ హనుమాన్ మందిరాల్లో పూజా కార్యక్రమాలకు అర్చకులను నియమించారు. ఇటీవలే బోధన్ పట్టణం శక్కర్‌నగర్‌లో నిజాం చక్కెర కర్మాగారం కొనసాగే కాలంలో భక్తులు, అధికారుల సహకారంతో గ్రామ దేవతలతో కూడిన త్రిశక్తి ఆలయాన్ని నిర్మించారు. కాలక్రమేనా ఆలయం శిథిలావస్థకు చేరడంతో కాలనీకి చెందిన కొందరు తమ ఆలయ జీర్ణోద్ధరణకు సురేశ్ ఆత్మారాం మహరాజ్‌ను సంప్రదించారు. ఈ విషయంపై స్పందించిన ఆయన ఆలయాన్ని పునర్నిర్మించారు. నాలుగు నెలల క్రితం ఆలయ పునః ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఆయనే స్వయంగా నిర్వహించారు. పలు పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు సురేశ్ ఆత్మారాం మహరాజ్ అందించిన సేవలు విశిష్టమైనవని పలువురు అభినందిస్తున్నారు.


నర్సాపూర్ రోడ్డు పక్కన నిర్మించిన శ్రీ సంజీవనీ ఆంజనేయస్వామి ఆలయం


ఎడపల్లిలో నిర్మించిన శ్రీరామ మఠం


దేవాదాయశాఖ పరిధిలో లేని ఆలయాల్లో దీపారాధనకు నూనె పంపిణీ చేస్తున్న సురేశ్ ఆత్మారాం మహరాజ్(ఫైల్)

### స్వచ్ఛంద కార్యక్రమాలు..

- ఎడపల్లి శ్రీరామ మఠం ఆధ్వర్యంలో హైందవ ధర్మ పరిరక్షణలో భాగంగా ఏటా నిజామాబాద్ పెద్ద రామ మందిరం నుంచి ఎడపల్లి శ్రీ రామమఠం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. సుమారు 15 ఏండ్ల నుంచి భక్తబృందంతో కలిసి పాదయాత్రను కొనసాగిస్తున్నారు.
- ఏటా పదో తరగతి విద్యార్థులకు చిలుకూరు శివయ్య అనుగ్రహం పేర పెన్నులు, పరీక్ష అట్టలు, నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు.
- బోధన్ పరిసర ప్రాంతాల్లో అక్బర్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయం, రుద్రూర్ శివాలయం, పోచారం నల్ల హనుమాన్ మందిరాల అభివృద్ధికి తనవంతు సేవలు అందించారు.
- రెండున్నర సంవత్సరాలుగా బోధన్ పరిసర ప్రాంతాల్లో దేవాదాయశాఖ పరిధిలోని లేని పలు ఆలయాల్లో దీపారాధనకు నూనె పంపిణీ చేస్తున్నారు.

# తొగరి.. లాభాలు భారీ

- ఆశాజనకంగా కంది సాగు
- కామారెడ్డి జిల్లాలో 17 వేల ఎకరాల్లో సాగు
- పెరుగనున్న పంట దిగుబడులు

గాంధారి,డిసెంబర్ 10 : కంది(తొగరి)పంటను సాగుచేసిన రైతుల పంట పండనున్నది. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది కామారెడ్డి జిల్లాలో కందిసాగు విస్తీర్ణం పెరిగింది. అనుకున్న విధంగా వర్షాలు కురియడంతో కంది పంట ఏపుగా పెరిగింది. సోయా, మక్కజొన్న, మినుము, పెసర తదితర పంటల్లో అంతర్ పంటగా సాగుచేసే కందిపంటను, ఈ సంవత్సరం జిల్లాల్లో అధికంగా 17వేల ఎకరాల్లో సాగుచేశారు. రైతులు సాగు చేసిన కంది పంటకు కాలం కలిసి రావడంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. కంది పంటను కొనుగోలు చేసేందుకు గతంలో మాదిరిగానే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

### అంతర పంటగా కంది సాగు..

కామారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో నల్లరేగడి భూములు అధికంగా ఉన్నాయి. వానకాలంలో రైతులు ప్రధానంగా సోయా, మక్కజొన్న, పత్తి తదితర పంటలను ప్రధానంగా సాగు చేయడంతో పాటు అంతరపంటగా కందిని సాగుచేస్తారు. సోయా, మక్కజొన్న పంటలు మూడు నెలల్లోనే కోతకు రావడంతో, కందిపంటను చీడపీడలు ఆశించకుండా సంరక్షిస్తున్నారు. జూన్, జూలై నెలల్లో విత్తుకున్న కంది 160 నుంచి 180 రోజుల్లో కోతకు వస్తుంది. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు కంది పంట ఏపుగా పెరిగి ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్నది. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది కాలం అనుకూలించడంతో అధిక దిగుబడి వస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



### అన్నదాతకు భరోసా..

ఒకే రకమైన పంటను సాగు చేస్తే వాతావరణం అనుకూలించని సందర్భాల్లో రైతులు నష్టపోతున్నారు. ఇలాంటి నష్టాలను పూడ్చుకోవడానికి చాలా మంది రైతులు ఏకకాలంలో రెండు లేదా మూడు పంటలను సాగుచేస్తున్నారు. ప్రధాన పంటలతో ఆశించినస్థాయిలో దిగుబడి రాకపోయినప్పటికీ అంతర్ పంటలతో ఆ నష్టాన్ని పూడ్చుకొని గట్టెక్కుతున్నారు. ఇందులో భాగంగా సోయా, మక్కజొన్న, మినుము, పెసర పంటల్లో అంతర్ పంటగా కందిని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది అంతర పంటగా కందిని సాగుచేసిన రైతులకు కాసులు కురిసే అవకాశం ఉన్నది.

### 17వేల ఎకరాల్లో కందిసాగు..

గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో కంది సాగు విస్తీర్ణం పెరిగింది. నల్లరేగడి భూముల్లో ప్రధాన పంటలతోపాటు అంతర్ పంటగా కందిని సాగు చేస్తారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 15,283 ఎకరాల్లో కంది పంటను సాగు చేయగా, ఈ సంవత్సరం 17వేల ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో నల్లరేగడి భూములు అధికంగా ఉన్న గాంధారి, సదాశివనగర్, తాడ్వాయి, లింగంపేట్, బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పిట్లం, బాన్సువాడ, పెద్ద కొడప్‌గల్, రామారెడ్డి తదితర మండలాల్లో సోయా, మక్కజొన్న, మినుము, పెసర తదితర పంటల్లో అంతర పంటగా కందిని సాగు చేస్తారు. రైతులు సాగుచేసిన కందిపంటకు చీడపీడల బెడదను అధిగమిస్తే అధిక దిగుబడులు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

### సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు..



ప్రతిరోజూ కంది పైరును పరిశీలించడంతోపాటు చీడపీడలు ఆశించకుండా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చు. పూత, కాత దశలో ఉన్నప్పుడు పచ్చపురుగు, లద్దెపురుగు, పేనుబంక వంటి తెగుళ్లు ఆశించే అవకాశాలు ఎక్కువ. వాటి నివారణకు ఫ్లూబెండా అమైడ్ అనే రసాయనాన్ని ఎకరానికి 100 ఎంఎల్, లేదా ఇమామెక్టిన్ బెంజోఏట్ అనే మందును 100 ఎంఎల్ పిచికారీ చేసుకోవాలి. పేనుబంక నివారణకు ఇమ్డాక్లోపెడ్‌ను పిచికారీ చేయాలి. ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహా ప్రకారం పురుగు మందులను పిచికారీ చేయడంతో చీడపీడల నుంచి రక్షించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

**-నరేశ్, మండల వ్యవసాయాధికారి, గాంధారి**